# మంచుదెబ్బ

**కె. రామలక్ష్మి**



“నీకామాత్రం బుద్ధి వుండివుంటే మా బ్రతుకు బాగానే నడిచేది” తల్లి నొక్కసారి నోరు మూయిస్తూ షర్టు వేసుకోవడం మొదలుపెట్టాడు భాస్కర్.

అవాక్కయి కొడుకు వంక చూస్తూ విలబడిపోయింది అన్నపూర్ణ. చెంపల దగ్గర ప్రారంభమైన నెరుపు తలంతా ఆక్రమించుకుంటూ ఉప్ప మిరియాల కలగలువులాగా తోస్తోందామె జుట్టు. జారిపోతున్న జుట్టుముడి రెండు చేతులెత్తి దగ్గిరగా తీసుకుంటున్నదల్లా కొడుకు మాటవిని ఆగిపోయింది. ప్రశ్నలు వదరలా విరుచుకు పడతామంటున్నాయి. కాని గట్టిగా నోరు మూసుకుని వాటి కద్దుకట్ట వేసింది అన్నపూర్ణ. “అత్తమీది కోపం దుత్తమీద అన్నట్టు మధ్య ఆవిడ మీద విరుచుకుషడతారెందుకు!” విసురుగా హాల్లోకి వస్తూ మొగుణ్ణి విలదీసింది భారతి.

చామనచాయ...కోపంతో ముఖం కాస్త ఎరుపు తిరిగి ఎండలోంచి నడిచి వచ్చినట్టు వుంది. చీరకొంగు నడుందగ్గర దోపివుంది. చేస్తున్న పని పదివిపెట్టి హడావిడిగా వచ్చినట్టుందామె వాలకంచూస్తే. “నువ్వు లోపలికి వెళ్ళు భారతీ, ఎందుకనవసరవు గొడవ? కోడల్ని వెనక్కి తిప్పాలని ఆమె జుట్టుమీద చెయ్యి వేసింది అన్నపూర్ణ. అత్తగారి చెయ్యి నెమ్మదిగానే తీసేస్తూ “మీరుండండి అత్తయ్యా యీయనగారి కెందుకంత నోటిదురుసు? తల్లిని పట్టుకు బుద్ది లేదనేంత బుద్ధిమంతుడా యీయవ? కోపంగానే అంది: “నువ్వు ముందు నోరుమూయ్. నాలుగక్షరాలు ముక్కలొచ్చి నాలుగురాళ్ళు సంపాదించగల్గితే చాలు- యీ ఆడముండలికి కాళ్ళు నేలనానవు!” విసురుగా వాచీతీసి పెట్టుకోబోతూ అన్నాడేమో ఆ విరుసులో వాచీవెళ్ళి ఎదుటి గోడదగ్గర పడింది.

భారతి వెళ్ళితీసి అందిస్తుందేమోనని చూశాడు. ఆమె ఎదుట తాను వెళ్ళి దాన్ని తీసుకోవడం కాస్త పరువుతక్కువ అనిపించింది.

అన్నపూర్ణ వెళ్ళబోయింది. కోడలామె చేయి పట్టుకు ఆపి “మీకెందుకత్తయ్యా తీసుకోనివ్వండి- మాసుకోనివ్వండి ఆదిపాడైతే మీరు బాధపడిపోయి కొత్తది కొనియిస్తారన్న ధీమా...మీరలా చేసిచేసే ఆయన్నలా తయారు చేశారు. అతగారినే కాస్తకోప్పడింది భారతి.

నిస్సహాయంగా ఆటు కొడుక్కేసీ ఇటు కోడలికేసీ చూసి వంటగదిలోకి చక్కాపోయింది అన్నపూర్ణ. “ఇప్పుడు చెప్పండి అత్తయ్యా? బుద్ధిలేదనడం దారుణం. మీ జీవితం మీ యిష్టం వచ్చినట్టు జమాయిస్తూ అన్నిటికీ ఆవిడనాడిపోసుకుంటారెందుకు-చేతకాని తనంకాకపోతే” భర్తకి దగ్గరగా నడుస్తూ అంది భారతి.

భారతి ముఖంలోకి చాలా కోపంగా చూశాడు. చేయికూడ ఎత్తాడు భాస్కర్. లేసి ఒక్క చెంపపెట్టు పెట్టాలన్న ఆత్రాన్ని ఎలాగో దిగమింగుకున్నాడు. ఓసారలా చేయి చేసుకున్నాకే జరిగిన రాద్ధాంతం జ్ఞాపకానికి వచ్చినట్టైంది. “ఏం ఆగారు? మీ పౌరుషం అంతే ఆడదాన్ని కొట్టడం దగ్గరే. కాని ఆమెది తప్పని విరూపించి కాదు అవునా!... అయినా కన్నతల్లిని ఎంతమాటేనా అనగల్గిన మీరు యింతకంటే సంస్కారం కల్గివుంటారని నేను అనుకోవడం లేదులేండి” భారతి కూడ లోపలికి చక్కాపోయింది.

సోఫాలో కూలబడి బూటు అందుకున్నాడు భాస్కర్. ‘ఛ ఇంట్లో వున్నది ముగ్గురు. ముగ్గురి మధ్య మూడు అగాధాలు’విసుక్కుంటూ బూటులో వున్న సాక్సుతోనే బూటుకాస్త తుడుచుకుని తొడుక్కున్నాడు. కొద్దిక్షణాలు చూశాడు-ఎవరో ఒకరు బయటికి రాకపోతారా అని...కాని ఆ అలికిడేం లేదు. విసుక్కుంటూ బ్రీఫ్‌కేస్ అందుకుని దబాలున తలుపువేసి బయటికి చక్కాపోయాడు. స్కూటర్ లేదు. రిపేర్‌కు వెళ్ళింది. చచ్చినట్లు నడిచిమెయిన్ రోడ్డుదాకా వెళ్ళి ఎక్కాలి ఆటో.

“వాడేం తినకుండా వెళ్ళిపోయాడు భారతీ విన్నటికి నిన్నా ఏం అంతే. రానురాను నా ఉనికిని భరించలేకుండా వున్నాడు ఏం చెయ్యను ఎక్కడికి పోను?”

“ఇది మరీ బాగుందత్తయ్య. మీరెందుకు వెళ్లాలి ఎక్కడికేనా! ఇది మీ యిల్లు. కావాలంటే ఆయన వెళ్ళాలి” తలదువ్వుకుంటూ అత్తగారి ముఖంలోకి చూసి అంది భారతి.

“కాని నాకు మనస్సు బాగుండడం లేదు. వీడి సూటీపోటీ మాటలు నన్ను కొంచెం కొంచెంగా చంపేస్తున్నాయి భారతీ! నాకేదారీ తోచడం లేదు” వస్తున్న ఏడుపుని ఆపుకొంటూ అంది



అన్నపూర్ణ.

“చూడండి ఇలా బాధపడడం ఎన్నోసారి? మీకెందుకు తోచదు-అలా తల్లిని తూలనాడే మనిషి-మనిషి కింద లెక్కలేదని, మీరేమంత తప్పచేశారని ఆ కోపం? భర్తనుంచి విడిపోవడం అంత ఘోరమైన తప్పకాదే. నరకం అనుభవిస్తూ ఎందుకు బ్రతకాలి? యిలాంటి సుపుత్రుడు పెద్దయ్యాక యిలాంటి మాట అంటాడని వూహించలేకపోయారు కదూ. నిజంగా అప్పడిలా అవుతుందని తెలిసి వుంటే ఆ నరకంలో హాయిగా పడివుండేవారు అవునా అత్తయ్యా” అత్తగారి దగ్గరికి వచ్చి ఎదురుగా వున్న స్టూలుమీద కూర్చుంది భారతి.

చాలాసేపు ఇద్దరు మౌనంగా వుండిపోయారు. ఎవరి వూహలు వారివే. తల్లిగా తానేం తప్పచేశానా అని అన్నపూర్ణ మదనపడుతుంటే భర్తగా భాస్కర్ లోపం వూర్తిగా తెలిసే తన జీవితంతోనే చెలగాటం ఆడుకుంటున్నానే అని భారతి బాధపడుతుంది. భారతికి పెళ్ళయి మూడేళ్ళయింది. కాని సంసారసుఖం ఎరుగదు. అలా అని భాస్కర్‌ని యీసడించుకోలేదు. డాక్టర్ని చూడమంది దానికే అతగాడి అహం అంతగా దెబ్బతినేసి...ప్రతి చిన్న విషయానికి భారతిమీద విరుచుకుపడడం అలవాటు చేసుకున్నాడు. అది తనలోటు కప్పిపుచ్చుకొందుకే అని భారతి గ్రహించిందని భాస్కర్‌కి తెలుసు. ఇది అతన్ని మరీ విపరీతపు మనిషిలాగా ప్రవర్తించేలా చేస్తుందా ఇంట్లో వాతావరణం ఎప్పుడూ పేలడానికి సిద్ధంగాఉన్న టైంబాంబులాగా వుంటుంది.

“ఏమిటి తల్లీ అంత ఆలోచన? నేను తాగి తండ్రిని వదిలానని యిప్పడంటున్నాడు. నేను వారితో సర్దుకుపోయి వుంటే వాడి జీవితం వేరుగా వుండేదని వాడి నమ్మకం” “మీరు తప్పపని చేశారత్తయ్యా. వీరిని తండ్రికి అప్పగించి వుండవలసింది” కసిగా అంది భారతి.

ఆ మాటకి అన్నపూర్ణ నవ్వింది. ‘నువ్వు వద్దు నీకొడుకు వద్దని కదా ఆయన తరిమేస్తే! వీడో గుదిబండగా వుంటాడని కదా ఆతండ్రి భావిస్తే? అంది ‘మీరాసంగతి భాస్కర్‌కి చెప్పారా?’

“ఎలా చెప్పను? నాలుగేళ్ళ వాడిని కంట్లో వత్తులు

వేసుకుని పెంచుకొచ్చాను. చక్కగా చదివించాము. తిరిగి చూసుకోవాలసిన పనిలేని స్థితికి తీసుకొచ్చాను. నిన్ను చూడవచ్చినప్పుడు మీ నాన్నగారితో వివరంగా చెప్పాను. కావలిస్తే వాడికి ఆస్తి పెళ్ళికి ముందరే ఇస్తానన్నాను. మీ నాన్న గారేమన్నారో తెలుసా భారతీ.

'నాన్న చాలా ప్రాక్టికల్ అత్తయ్యా. పిచ్చిపిచ్చి వేషాలంటే మండిపడతారు. చాలా దూరం ఆలోచించాలి నిర్ణయం చేసే ముందు. ఈ రోజీ నిర్ణయం సబబుగా కన్పించినా...కొంత కాలానికది పామై కాళ్ళకడ్డం పడగలదు. జాగ్రత్త అంటుండే వారు.."అంది భారతి.

కోడలి తల నిమురుతూ "సరిగ్గా అదే చెప్పారు. ఆస్థికంటే ఉద్యోగం ముఖ్యం. బాధ్యత వుంటుంది. రేపు అతగాడు పూర్తిగా మారి మిమ్మల్ని పొమ్మంటే. ఎక్కడికి వెళతారు? కొంతేనా స్వంతానికి వుంచుకోవాలి. అది స్వార్థం కాదు. దూరదృష్టి అని హెచ్చరించారు. చూస్తున్నావుగా వాడేం అడిగితే లేదన్నాను భారతీ...అయినా నామీద ఇంతకసి.. నేనూ వారూ కలిసివుంటే తన జీవితం యింకోలా వుండేదనుకొంటాడేగాని... కుక్కలు చింపిన విస్తరిగా తయారై వుండేదని ఎందుకనుకోడు? పిచ్చిసన్నాసి! నిట్టూర్చింది అన్నపూర్ణ.

"చాలా పొరపడుతున్నారత్తయ్యా–పిచ్చికాదు. అదొక స్ట్రాటజీ ఎత్తుగడ! ప్రతిక్షణం ఎదుటివారు తప్పచేశారని నిలదీస్తూంటే...తననెవరూ నిలదీయరని..అంతే, ఇంక ఆరోజూ వస్తుందత్తయ్యా. అప్పుడు చూడాలి మీ నిర్ణయం! 'నా కర్థం కావడం లేదు భారతీ, నా మూలంగా మీరు దెబ్బలాడుకోవడం నేను భరించలేకుండా వున్నాను.

'మీరు ఒక వంక, అంతే భాస్కర్‌కి మీరిక్కడ లేకుండా వుంటే బాగుంటుంది. దానికి కారణం మీరుండడం–కానే కాదత్తయ్య...ఏ క్షణాన్నైనా నేను వాస్తవ పరిస్థితి బయట పెడతానేమోనని. అంటే కాస్త పేలవంగా నవ్వింది భారతి. భారతి కంఠధ్వనిలో మార్పు గ్రహించకపోలేదు అన్నపూర్ణ.

" మీ ఇద్దరి మధ్య ఏదో మౌనపోరాటం జరుగుతుందని గ్రహించగల్గాను గాని అదెందుకో అర్థం కావడం లేదు. నేను కొన్నాళ్ళైనా దూరంగా వెడితే–



మీరు సర్దుకుంటారెమో అనిపిస్తుంది భారతీ..."

"నో నో సర్దుకోను సరికదా క్షణాల మీద క్షయిమాక్సుకు చేరుతుంది" గబగబ అనేసింది భారతి.

"ఎలా? అలా ఎందుకు జరుగుతుంది భారతీ. చెప్ప. "కోడలి చేతులు పట్టుకుంటూ అడిగింది అన్నపూర్ణ క్షణం ఏమీ చెప్పలేనన్నట్టు తల అడ్డంగా వూపి "నో నేను చెప్పి మిమ్మల్ని ఇంకా బాధపెట్టను. జీవితంలో మనిద్దరం- మనవాళ్ళ చేత మోసగింపబడ్డ వాళ్ళం అత్తయ్యా. మీకు నేనేం చెప్పలేను. "వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ అంది భారతి.

'నా మీద ఒట్టు. సువ్వారోజు చెప్పితీరాలి. ముగ్గురం శత్రువుల్లా బ్రతకడం నేనింక సహించలేను భారతీ, వాడు నిన్ను కొట్టున్నాడా? హింస పెడుతున్నాడా? లేక...'భారతి ముఖంలోని బాధగా చూస్తూ 'వాడికే చెడుతిరుగుళ్ళు అలవాటయ్యాయా–ఆ తండ్రిలాగే తయారయ్యాడా. చెప్ప భారతీ–నాకు భయంలేదు. ఈ గుండె యింక బాధాపడదు" దృఢంగా అంటున్న అత్తగారి ముఖంలోకి జాలిగా చూసింది భారతి. పేలవంగా నవ్వి. "తండ్రి అలికిపోతే యీ కొడుక్కు అసలు కోరికకే తావులేదత్తయ్యా" అందుకే అధికారం చెలాయించి నన్ను బానిసగా చూడాలన్న కోరిక.." చాలా స్పష్టంగా అంది భారతి.అన్నపూర్ణ భారతికేసి చూస్తూ వుండిపోయింది. "మీరేమనుకుంటున్నారో నేను గ్రహించగలను...మీ కెందుకు తెలియలేదని కదూ? ఎలా తెలుస్తుంది? జాతకాలు చూస్తారు, వంశాలు చూస్తారు, మంచి ముహూర్తాలు చూస్తారు. కాని కట్టుకున్న దానికి కూడ కలచెదిరేది ఆఖరు క్షణావకదా విట్టూర్చింది భారతి.

"మీరు బాధపడకండి. మీరేం చెయ్యలేరు. నేను చెయ్యి కల్గి ఏం చెయ్యలేకపోయాను..భాస్కర్ అహంకారం అందుకు అడ్డువచ్చింది. మగాడినన్న పౌరుషం అతన్ని ఆలోచించుకోనీయడం లేదు..."

"భారతీ ఇంత అగ్నినెలా దాచుకు తిరుగుతున్నావు?" అన్నపూర్ణ గొంతు ఎక్కడో నూతులోంచి వస్తున్నట్టయింది. 'మిమ్మల్ని అవమానిస్తున్న కొడుకుని మీరు ఏం చేయకల్గారు? ఒక్కరోజు–'నోరుముయ్యరా–కావలిస్తే ఆ తండ్రిదగ్గరికే పో' అని అనగలిగారా' నేనూ అంతే. నేను మిమ్మల్ని ఈ మనిషి అవహేళనలను వదిలి ఎక్కడికీ పోను అత్తయ్యా...అందుకే...

"వద్దమ్మా వద్దు–పచ్చని బ్రతుకు మోడు చేసుకోకు–విడాకుల పుచ్చుకో. హాయిగా మళ్ళీ పెళ్ళాడు. నామాట కాదనకు తల్లీ"భారతి చేయి అందుకుంటూ ప్రాధేయపడుతున్నట్టు అడిగింది అన్నపూర్ణ. హాల్లో ఫోను మ్రోగడం విని లేచి వెళ్ళింది భారతి 'ఏమిటి'భయంగా అడిగింది. అవతలి వాళ్లేం అన్నారో 'వస్తున్నాం..యిప్పడే అంటూ పెట్టేసింది ఫోను' హాల్లోకి వచ్చిన అన్నపూర్ణ అడిగింది. 'ఎవరు?' 'స్కూటర్ పూర్తిగా రిపేరవకుండా బలవంతంగా తీసుకువెళ్లాట్ట భాస్కర్. బస్సుకి గుద్దేశాడని..మెకానిక్ ఫోను పదండి..' భారతికి ఏడుపు రాలేదు. అన్నపూర్ణ కూడ షాక్‌తిన్న మనిషిలా సైలెంట్‌గా వుండిపోయింది.

ఆటో తీసుకుని ఆస్పత్రి చేరేసరికి అంతా అయిపోయింది. డాక్టర్ కోరికపై 'ఏఏ అవయవాలు కావలిస్తే–వాటిని తీసుకోండి' అంది నిర్లిప్తంగా అన్నపూర్ణ. "ఎవరికైనా ఉపయోగపడే కళ్ళూగట్రా తీసుకోనివ్వండి అత్తయ్యా... పుణ్యం...భాస్కర్ కొట్టిన దెబ్బ మనకి శాశ్వతంగా వుంటుందిగా" అంటూ అత్తగారిని ఓదార్చింది భారతి.

భారతి ఔదార్యం అందరూ మెచ్చుకున్నారు. కాని ఆమె కసికూడ దాంట్లో వుందని అన్నపూర్ణకే తెలుసు.

◆


# ఏ విషయాన్నయినా మీరు సరికొత్తగా చెప్పగలరా?

అయితే మీకిదే మా ఆహ్వానం! కథ, కవిత, గల్పిక, వ్యాసం... ఏదైనా సరే! మీదయిన స్టయిల్‌లో సరికొత్తగా చెప్పండి. మేం ప్రచురిస్తాం. కొత్తదనాన్ని, కొత్తకలాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా మీ రచనలను ఆహ్వానిస్తున్నాం. మీ రచనలు పంపవలసిన చిరునామా: సంపాదకుడు, ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, రోడ్‌నెం.3, బంజారాహిల్స్, హైదరాబాద్–34.